# నమస్తే తెలంగాణ
# వరంగల్

5 మంగళవారం 23 జూలై 2024 WARANGAL




ములుగురూరల్: రాళ్లవాగు వద్ద వరదను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

# గోదావరి ఉగ్రరూపం

**కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం**

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 15.650 మీటర్లు
- రాత్రి వరకు రెండో ప్రమాద హెచ్చరిక దాటే అవకాశం
- పేరూరు వద్ద 17.280 మీటర్లు
- ములుగు జిల్లాలో పలు చోట్ల వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి సీతక్క
- కొండాయి నుంచి గర్భిణుల తరలింపు

ఏటూరునాగారం/తాడ్వాయి/ములుగు రూరల్/గోవిందరావుపేట/వాజేడు/కాళేశ్వరం, జూలై 22: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూ పం దాల్చింది. కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. తెలంగాణ, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో గోదావరి, ప్రాణహిత నదులు పొంగి 9,36,890 క్యూసెక్కుల నీరు వస్తూ 12.25 మీట ర్ల ఎత్తు దాటి లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నాయి. పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపోయింది. అక్కడ ఉన్న ప్రజలను అధికారులు దగ్గరలోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు. ఏటూరునాగారం ముల్లకట్ట బ్రిడ్జి వద్ద రెండు కిలోమీటర్ల వెడల్పుతో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 15.650 మీటర్లకు చేరింది. రాత్రి వరకు రెండో ప్రమాద హెచ్చరిక 15.830 మీటర్ల స్థాయి దాటే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వాజేడు మండలంలోని పేరూరు వద్ద 17.280 మీటర్లకు గోదావరి నీటిమట్టం చేరింది.

**వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి సీతక్క**

ఏటూరునాగారం మండలంలోని ఓడవాడ, రామన్నగూడెంలోని పుష్కరఘాట్, ముల్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి వరదను మంత్రి సీతక్క పరిశీలించారు. వరదలు వస్తే అప్రమత్తంగా ఉండాలని, బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మేడారంలోని జంపన్నవాగుతోపాటు ముంపు గ్రామాలను మంత్రి సీతక్క పరిశీలించారు. కలెక్టర్ దివాకర, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీష్‌తో కలిసి మొదటగా ఎల్బాక వద్ద వరదనీటిని పరిశీలించారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా శివారులోని గుండ్లవాగు బ్రిడ్జి, రాఘవపట్నంలోని దయ్యాలవాగు బ్రిడ్జిలను సీతక్క పరిశీలించి ఇరువైపులా సైడ్ వాల్స్‌ను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ములుగు మండలం బండారుపల్లి శివారులోని రాళ్లవాగు వద్ద నిర్మిస్తున్న వంతెన పక్కన ఉన్న తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో సీతక్క పరిశీలించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గర్భిణులను ఏటూరునాగారానికి తరలింపు**

కొండాయి, మల్యాల గ్రామాలకు చెందిన పాయం స్నేహ, దబ్బగట్ల భవానిని ఊరట్టం, మేడారం మీదుగా అంబులెన్స్‌లో ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు తరలించినట్లు వైద్యాధికారి ప్రణీత్ కుమార్ తెలిపారు. వైద్య సిబ్బంది భాస్కర్, సమ్మక్క, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# టాయిలెట్స్‌ను వెంటనే ప్రారంభించండి

**ఇనుగుర్తి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మురళీనాయక్**

ఇనుగుర్తి , జూలై 22 : ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాలలోని మరుగుదొడ్ల కాంప్లెక్స్‌ను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అధికారులను ఆదేశించారు. అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్ వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బంది విషయమై ఈ నెల 10న నమస్తే తెలంగాణలో 'కంపు కొడుతున్నా వెళ్లాల్సిందే'! శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి సోమవారం పాఠశాలలోని టాయిలెట్స్‌ని పరిశీలించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు-మన బడిలో భాగంగా రూ.7.50లక్షలతో నిర్మించిన మరుగుదొడ్ల కాంప్లెక్స్‌ని పరిశీలించి వెంటనే వినియోగం తీసుకురావాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో పైకప్పు ఊడుతున్నదని ఉపాధ్యాయులు తెలుపడంతో మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న నాలుగు తరగతి గదుల పనులను వెంటనే ఉపయోగంలోకి తీసుకరావాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రూపారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురెల్లి సతీశ్, గంజి రాజేందర్‌రెడ్డి, బైరు అశోక్ గౌడ్, తమ్మడపల్లి కుమార్, సతీశ్, చరణ్, మామిడి జనార్దన్ తదితరులు ఉన్నారు.

నమస్తే ఎఫెక్ట్



టయిలెట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

# 'గలగలరాగం' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటీని ఆవిష్కరిస్తున్న దేవీప్రసాద్, సిద్దారెడ్డి

దాశరథి కృష్ణామాచార్యుల కవితలు, రచనలు ఆదర్శమైనవని టీఎన్జీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్, నందిని సిధారెడ్డి అన్నారు. సోమవారం శత జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా గ్రంథాలయంలో రిటైర్ లైబ్రేరియన్ గండ్రకోటి లక్ష్మణ్ రచించిన 'గలగలరాగం' కవితా సంపుటిని వారు ఆవిష్కరించారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో దాశరథి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది కవులు, కళాకారులుగా తయారయ్యాయ అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రారపు వీరేందర్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



దాశరథి శత జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రూనాయక్

**తన రచనలతో నిజాంను ఎదిరించిన ఘనుడు**

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్
- దాశరథి నేటి యువతకు ఆదర్శం
- ఎమ్మెల్సీ, కవి, రచయిత దేశపతి శ్రీనివాస్
- పట్టుదలకు మారుపేరు దాశరథి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- ఘనంగా దాశరథి శత జయంతి వేడుకలు

# మహనీయుడు దాశరథి

**తెలంగాణ సమాజానికి ఆయన సేవలు మరువలేనివి**



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే దేశపతి శ్రీనివాస్,రామచంద్రూనాయక్

మహబూబాబాద్ రూరల్, జూలై 22 : మానుకోట గడ్డ మీద పుట్టిన దాశరథి కృష్ణాచార్యులు తెలంగాణ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన గొప్ప పోరాట యోధుడు దాశరథి అని, ఆయన మానుకోట గడ్డ మీద పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. తన అక్షర శరాలతో నిజాం రాజును గడగడలాడించిన ధీశాలి అని కొనియాడారు. ఎమ్మెల్సీ, కవి, రచయిత దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న దాశరథి కృష్ణామాచార్యులు నేటి యువతకు ఆదర్శమన్నారు. సాహిత్య రంగానికి ఆయన ఎనలేని సేవలు చేశారని, తన రచనలతో జీవచ్ఛవంలా బతుకుతున్న తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపిన మహనీయుడని అన్నారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన దాశరథి సాహిత్య రంగానికి చేసిన సేవతోనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని అన్నారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటాలు చేసినందుకు అనేకమార్లు జైలు జీవితాన్ని గడిపారన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. చిన్నగూడూరులో పుట్టి అనేక ఉద్యమాల్లో పాల్గొన్న దాశరథి కృష్ణామాచార్యులకు కృషి, పట్టుదలకు మారుపేరని అన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో నేడు ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించినట్లు చెప్పారు. నిరంతర కఠోర దీక్షతో తాను అనుకున్నది సాధించేవారని అన్నారు. దాశరథి కవితలు, రచనలు ఎంతో మందిని చైతన్యవంతం చేశాయన్నారు. దాశరథి సేవలను మరింత విస్తరించేలా ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని, పట్టణంలో ఆడిటోరియం, స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం పేదల సమస్యలపై ఉద్యమిస్తూ, నిజాం నిరంకుశత్వానికి తన అక్షరాలతో ఎదురొడ్డి నిలిచిన గొప్పవ్యక్తి దాశరథి అని అన్నారు. రజాకార్లు తీవ్రంగా హింసించినా తెలంగాణ ఉద్యమాన్ని ఆపలేదని, తన కవితలు, రచనలతో ప్రజలను చైతన్యవంతం చేసినట్లు తెలిపారు. టీఎన్జీవోస్ నాయకుడు దేవీప్రసాద్, టీయూడబ్ల్యూ (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. దాశరథి పోరాట పటిమ, సాహిత్య రచనలను యువత ముం దుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కవులు, రచయితలుపాల్గొన్నారు.

# సొంతూరిలో పండుగ

- ఘనంగా శత జయంతి ఉత్సవం
- చిన్నగూడూరు నుంచి మానుకోటకు ర్యాలీ
- తరలివచ్చిన కవులు, కళాకారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

చిన్నగూడూరు, జూలై 22 : దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకలు చిన్నగూడూరు మండల కేంద్రంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, కవి, రచయిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, టీఎన్జీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీతోపాటు కవులు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, ఉద్యమకారులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాశరథి సోదరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులు తమ ఆటపాటతో ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నగూడూరు నుంచి బైక్ ర్యాలీగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అని ఎలుగెత్తి చాటి, నిజాం పాలనపై నిప్పులు చెరిగిన మహనీయుడి స్వగ్రామం చిన్నగూడూరును సందర్శించి వేడుకల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. దాశరథి శత జయంతి వేడుకలను సంవత్సరమంతా నిర్వహిస్తామన్నారు. ఉద్యమ శక్తిగా, వేదాల అనువాదకుడిగా, సినీ గేయ రచయితగా దాశరథి కీర్తి హిమాలయ శిఖరమంత ఎత్తుకు ఎదిగారని అన్నారు.

# చెక్కుచెదరని మేడిగడ్డ

- భారీ వరదను సైతం తట్టుకొని నిలబడిన బరాజ్
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వేల క్యూసెక్కుల నీరు వృథా
- కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకే ప్రయత్నాలు
- రేవంత్ రెడ్డి సర్కారు కుట్రలు మానుకొని రైతులకు మేలు చేయాలి
- బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు




మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న పుట్ట మధు

మహదేవపూర్, జూలై 22: ఎగువ నుంచి వస్తున్న లక్షల క్యూసెక్కుల భారీ వరదను సైతం తట్టుకొని మేడిగడ్డ బరాజ్ చెక్కుచెదరకుండా ఉందని బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. సోమవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వరదను తట్టుకొని నిలబడడంతో కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ బరాజ్‌పై ఇన్నాళ్లు చేసినవన్నీ అబద్ధాలని తేలిపోయిందన్నారు. వారు కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు మేడిగడ్డ బరాజ్‌పై అసత్య ప్రచారాలకు తెరలేపారన్నారు. సకాలంలో మరమ్మతులు చేపట్టక కాలయాపన చేసి రైతులకు సాగు నీరివ్వకుండా పంటలను ఎండబెట్టి రైతాంగం, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సాగు, తాగు నీరు కష్టాలు లేకుండా చేసేందుకే కేసీఆర్ దూర దృష్టితో ఆలోచన చేసిన అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే కాంగ్రెస్ నాయకులు చూసి ఓర్వలేక పోయారన్నారు. బరాజ్‌లోని 85 పిల్లర్లలో రెండు కుంగుబాటుకు గురైతే మొత్తం బరాజ్ వరదలతో కొట్టుకపోతుందని, లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని, అబద్ధాలు, అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. కళ్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రజలను రోడ్ల మీది తెచ్చి మూసీ నదికి ముందుకు తీసుకవస్తున్నారని, మూసీ నది అభివృద్ధికి సీఎం ఒకనాడు రూ.50వేల కోట్లని, మంత్రి జూపల్లి కృష్ణారావు రూ. 70వేల కోట్లని, మరోసారి ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి రూ. లక్షా యాభై వేల కోట్ల అంచనాలంటున్నారని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మూసీపై మూడు సార్లు రేట్లను పెంచిన ఘనులు కాంగ్రెస్ పార్టీ నాయకులని అన్నారు. కళ్లు ఉండి చూడలేని కబోదులు ప్రపంచంలో ఎవరన్నా ఉన్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మేడిగడ్డతో ప్రజలు కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పే రోజు వచ్చిందని, కాళేశ్వరంతో రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు. దానికి సాక్ష్యమే మేడిగడ్డ బరాజ్ అని గుర్తు చేశారు. బరాజ్‌లో లక్షల క్యూసెక్కుల వరద నీరు వృథాగా పోతుందని, ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరిచి రైతులు, ప్రజల గురించి ఆలోచన చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పునర్ వినియోగంలో తీసుకురావాలన్నారు. కేసీఆర్, బీఆర్‌ఎస్‌పై ఉన్న కోపంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, సీనియర్ నాయకులు అన్కారీ ప్రకాశ్, పెండ్యాల మనోహర్, మాజీ వార్డు సభ్యుడు కడార్ల శంకర్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అలర్ట్‌గా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలి
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, జూలై 22: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. సోమవారం జూమ్ ద్వారా మంత్రి వరంగల్ కలెక్టర్ సత్యశారదతో మాట్లాడారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి ప్రజలను తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు నిండి ఉన్నాయని తెలిపారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, ముఖ్యంగా తహసీల్దార్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పునరావాస కేంద్రాల్లో భోజనం, వృద్ధులకు పండ్లు, పిల్లలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు 24గంటలు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహిస్తున్నా ఆయా ప్రాంతాల్లో గ్రామ ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు చెరువులు, కుంటల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేస్తూ క్లోరినేషన్ చేపట్టాలన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు చెరువులను నిత్యం పర్యవేక్షించాలన్నారు. అత్యవసర సాయం కోసం ప్రజలు వరంగల్, హనుమకొండ కలెక్టరేట్లలోని టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 3434, 9154225936, 1800 425 1115, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1980, 9701999676 విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 0028 వర్షాల నేపథ్యంలో ప్రజలు సంప్రదించాలని కోరారు. ఈ జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కేఎంసీలో ప్రొఫెసర్ల కొరత

- 30 మందికి పైగా బదిలీ
- ఆందోళనలో వైద్య విద్యార్థులు
- నియామకాలు లేకుండా బదిలీలేమిటని ఆవేదన



వరంగల్ చౌరస్తా, జూలై 22 : కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. బదిలీల్లో ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో వైద్య విద్యార్థులకు శాపంగా మారింది. కళాశాలలో నియామకాలు చేపట్టకుండా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లను బదిలీ చేయడం వల్ల తాము పరీక్షల సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 20శాతం బోధకుల లోటుతో నెట్టుకొస్తున్న సమయంలో అందుబాటులో ఉన్న సగం మందిని ప్రభుత్వం బదిలీ చేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతున్న ఈ బదిలీలను మరోసారి ప్రభుత్వం పరిశీలించి ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని వారు కోరుతున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు అనుసరించి మెడికల్ కళాశాలల్లో ఉన్న వసతులు, బోధనా సిబ్బందిని పరిగణలోకి తీసుకొని పీజీ సీట్ల కేటాయింపు జరుగుతుంది. ప్రస్తుతం కేఎంసీ నుంచి భారీగా ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లడంతో రానున్న విద్యాసంవత్సరానికి అవసరమైన ప్రొఫెసర్లు అందుబాటులో లేక పీజీ సీట్ల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రొఫెసర్ల కొరత కారణంగా ఇతర కళాశాలల ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో పీజీ మెంటార్ వ్యవస్థ కొనసాగుతున్నదని, రానున్న రోజుల్లో మరింత ఇబ్బందికరంగా మారుతుందని అంటున్నారు.

**ప్రముఖ విభాగాల్లో బదిలీలు**

- జనరల్ మెడిసిన్‌లో ఆరుగురు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లగా నలుగురు ప్రొఫెసర్లు మాత్రమే నియామక పత్రాలు తీసుకున్నారు.
- మైక్రోబయాలజీ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లగా ఉస్మానియా నుంచి ఒక్క అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే బదిలీపై వచ్చారు.
- జనరల్ సర్జరీ విభాగంలో ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లగా ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే కేఎంసీకి వచ్చారు.
- చెవి,ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీ కాగా ఒకరు మాత్రమే నియామక పత్రం తీసుకున్నారు.
- ఆర్థోపెడిక్ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు.
- కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ కావడంతో ఆ విభాగం ఖాళీగా మారింది.

సైకాలజీ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు.

రేడియాలజీ విభాగంలో ఇద్దరు అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లారు.

# కూంబింగ్‌కు వెళ్లి.. అడవిలో చిక్కి..

**ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మండపాకకు తరలింపు**

వాజేడు, జూలై 22 : ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కూంబింగ్‌కు వెళ్లిన పోలీస్ బలగాలు అస్వస్థతకు గురై అడవిలో చిక్కుకున్నాయి. ఇటీవల ఎలిమిడి ఎన్‌కౌంటర్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో పెనుగోలు గుట్టల వద్ద వాగులు పొంగి ప్రవహించడంతో వచ్చే మార్గంలేక అక్కడే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు వారిని సోమవారం ప్రత్యేక హెలికాప్టర్ సాయం తో వాజేడు మండలం మండపాక హెలిప్యాడ్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వారికి చిక్సిత అందించి ములుగు తరలించారు.



హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్

మండపాక హెలిప్యాడ్ నుంచి వైద్యం కోసం తరలిస్తున్న పోలీస్ సిబ్బంది